

వెళ్లొస్తాం.. మళ్లొస్తాం!

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రద్దీ..

- ముగిసిన సంక్రాంతి పండుగ
- తిరుగు ప్రయాణాలతో రద్దీ
- ఫుల్‌గా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- మళ్లీ ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ
- కార్లు, బైక్‌లతో పెరిగిన ట్రాఫిక్
- రద్దీగా మారిన రహదారులు
- విమానాశ్రయం కిటకిట

సామర్లకోట/అమలాపురంటౌన్/జనవరి16: సంక్రాంతి సంబరాలు ముగిశాయి. మూడు రోజులపాటు ప్రజలంతా ఆనందంగా గడిపారు. బంధుమిత్రులతో విందులు, కోడిపందాలు, గుండాటలు, పేకాటలతో సందడి చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కొంతమంది చుట్టివస్తే, మరికొందరు ఆలయాలను దర్శించారు. సినిమాలు, షికార్లతో ఇంకొందరు ఉల్లాసంగా గడిపారు. మూడు రోజులు ముగియడంతో దూరతీరాల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు లక్షలాదిగా తరలివచ్చిన బంధుమిత్రులంతా ఇప్పుడు తిరుగు ప్రయాణం బాటపట్టారు. సంక్రాంతికి రెండు రోజుల ముందే ఈసారి బంధుగణం వేలాదిగా గ్రామాలకు తరలివచ్చారు. విదేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి కార్లు, బైక్‌లు తదితర వాహనాల్లో భారీగా వచ్చారు. గత శనివారం ఉదయానికే పెద్దఎత్తున జిల్లాకు చేరారు. వరుస సెలవులు కలసిరావడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు అందరూ మధ్యలో సెలవులు పెట్టుకుని మరీ తమ తమ స్వగ్రామాలకు తరలివచ్చారు. ముఖ్యంగా ఈనెల 11న రెండవ శనివారం కావడంతో ఆది, సోమ, మంగళ, బుధవారాలు పండుగ సెలవులు కలిసి రావడంతో చాలామంది శుక్రవారం రాత్రే పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు చేరుకున్నారు. పండగ పూర్తికావడంతో ఇప్పుడు పట్టణాలకు తిరుగు ప్రయాణం కట్టారు. గురువారం ముక్కనుమ కావడంతో తిరుగు ప్రయాణాలు ఆరంభమయ్యాయి. దీంతో అన్ని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు ప్రయాణికులు, లగేజీలతోనూ కిటకిటలాడాయి. అత్యధికులు ముక్కనుమ పండుగ పూర్తి చేసుకుని గురువారం సాయంత్రం తమ తమ గమ్యస్థానాలకు బయలుదేరడంతో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం సహా అన్నిచోట్ల నుంచి తిరుగు ప్రయాణంలో ఉన్న కార్లు, బస్సులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. ఆర్టీసీ ముందస్తు ఏర్పాట్లు చేశామని చెప్పినా అవేవీ ప్రయాణికుల అవసరాలను తీర్చే స్థాయిలో లేవు. ప్రతి బస్టాండ్‌లోనూ వందలాది మంది ప్రయాణికులు గంటల తరబడి వేచిచూడడం కనిపించింది. అటు పండుగలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు ముందుగా ప్రకటించిన రైల్వే తదనంతరం ప్రయాణికుల రద్దీ ఆశించినరీతిలో లేదంటూ అర్థంతరంగా రద్దుచేయడంతో ప్రత్యేక రైళ్లల్లో ప్రయాణించేందుకు ఆయా స్టేషన్లకు చేరుకున్న వారంతా రద్దు సమాచారంతో తీవ్ర నిరుత్సాహానికి గుర య్యారు. ప్రైవేట్ బస్సుల ట్రావెల్స్ వారు సైతం మూడు నుంచి నాలుగు రెట్లు అదనపు చార్జీలను వసూలు చేయడంతో ప్రయాణికులు తిరుగు ప్రయాణంలోనూ నిలువుదోపిడీకి గురికాక తప్పలేదు. ఇక విమానాలదీ ఇదే పరిస్థితి. మధురపూడి ఎయిర్‌పోర్టు ఖాళీ లేకుండా ఉంది. తిరిగి వెళ్లే ప్రయాణికులతో రద్దీ నెలకొంది. టిక్కెట్ ధర డబుల్ చేసినా ప్రయాణికులు వెనుకడుగు వేయడంలేదు. ఇక ప్రైవేట్ ట్రావెల్స్‌కి డిమాండ్ పెరిగింది. దాంతో చార్జీలు బాదేశారు.

రహదారులన్నీ కిటకిట..

సంక్రాంతి పండుగ వచ్చినవారు తిరుగు ప్రయాణంలో ఉండడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. మళ్లీ తమ తమ విధులకు హాజరయ్యేందుకు ప్రయాణికులు కార్లు, బస్సుల్లో బయలుదేరడంతో దాదాపు అన్ని రోడ్లలో ట్రాఫిక్ స్తంభించింది. జాతీయ రహదారులు కిక్కిరిసిపోయాయి. రావులపాలెం నుంచి విజయవాడ వెళ్లే రహదారి.. ఇటు దివాన్‌చెరువు నుంచి విజయవాడ వెళ్లే రహదారులు రద్దీగా కనిపించాయి. టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరాయి. మరోవైపు పెట్రోల్ బంకుల్లోనూ రద్దీ కనిపించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. తిరుగు ప్రయాణంలో సొంత వాహనాల్లో ఊళ్లకు బయలు దేరడంతో ఎక్కడి కక్కడ రద్దీ కనిపించింది. ఆర్టీసీ డిపోలో బస్సుల కోసం గురువారం ఉదయం నుంచి ప్రయాణికులు నిరీక్షించారు. ఆర్టీసీ హైదరాబాద్‌తోపాటు ముఖ్య పట్టణాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసినా ప్రయాణికుల కొరతను తీర్చలేకపోయింది. దాంతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆశ్రయించాల్సిరావడంతో పెద్దఎత్తున దోచుకుంటున్నారు.



కాకినాడ బస్టాండ్‌లో ఇలా..



బస్టాండ్ కిటకిట

సెంటిమెంట్‌తో.. ఆగారు!

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా హైదరాబాద్‌కు సొంతూర్ల నుంచి ప్రయాణికులు బయలుదేరివెళ్లారు. వీరంతా ముందుగా తిరుగు రిజర్వేషన్లు చేసుకున్నవారే. గురువారం తూర్పుగోదావరి జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఆరు స్పెషల్ సర్వీసులు నడిపారు. శుక్రవారంపొద్దు సెంటిమెంట్‌తోపాటు ముక్కనుమ కారణంగా చాలామంది ప్రయాణాలు మానుకున్నారు. అయితే శని, ఆదివారాల్లో రష్ భారీగా ఉండొచ్చని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఆదివారం వరకు సెలవులు పెట్టుకుని రావడంతో కొందరు ఆలస్యంగానే తిరుగుపయనం అవుతున్నారు. పండుగ సెలవులతోపాటు శని, ఆది వారాలు కలుపుకుని మిగతా రోజులు సాధారణ సెలవులు తీసుకుని ఏకంగా తొమ్మిది, పది రోజులపాటు స్వగ్రామాల్లోనే ఉండిపోవడం ఈసారి విశేషం. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని బట్టి అవసరమైతే ఈ రూట్లలో స్పెషల్స్ నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి హైదరాబాదుకు వేసిన స్పెషల్ ట్రైన్లు అన్ని గురువారం రద్దీగా మారాయి. అదేవిధంగా జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లు కూడా ప్రయాణికులతో కిక్కిరిశాయి.



- 7లో

ఆనందం ఆవిరి!

పండుగకు వచ్చి.. ప్రమాదానికి గురై ఇద్దరి మృతి



విలపిస్తున్న బంధువులు

చిన్నతప్పు పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది.. క్షణంలో ప్రాణాలు తీసేస్తుంది.. డ్రైవర్ అతివేగం ఇద్దరి ప్రాణాలు బలిగొంది.. అప్పటివరకూ ఆనందంగా గడిపిన క్షణాల్లో విషాదం నింపింది.. ఎక్కడెక్కడి నుంచో సంక్రాంతి పండుగకు వచ్చారు. కాకినాడ జిల్లా తూరంగిలో పండుగ మూడు రోజులు తమ బంధువుల ఇంట ఆనందంగా గడిపారు.. సెలవులు ముగుస్తుండడంతో గురువారం ఉదయం 10:30 గంటలకు ప్రత్తిపాడు మండలంలోని ధారపల్లి జలపాతం వద్దకు 30 మంది టెంపో వ్యాన్‌లో విహారయాత్రకు బయలుదేరారు.. పండుగ ముచ్చట్లు చెప్పుకుంటూ ఆనందంగా ఉన్నారు.. వాహనం వేగంగా వెళుతోంది.. అంతలోనే ఒక్క కుదుపు.. వ్యాన్ కాస్తా ఒక కాలువలోకి బోల్తా పడింది.. ఏం జరిగిందో తెలియలేదు..అంతా తేరుకుని చూసేసరికి 28 మంది గాయాలతో బయటపడగా ఇద్దరు మహిళలు దుర్మరణం పాలయ్యారు. దీంతో విషాదయాత్రగా మారింది..



దుర్గేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఆంధ్రాగోవా కోకో బీచ్‌గా ఎస్.యానాం

టూరిజం శాఖామంత్రి కందుల దుర్గేష్

ఉప్పలగుప్తం, జనవరి16(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్‌ను ఆంధ్రగోవా కోకో బీచ్‌గా అభివృద్ధి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర పర్యాటకశాఖమంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. కోనసీమ అందాలు కేరళ అందాలకంటే ఎంతో మిన్నగా ఉంటాయన్నారు. ఎస్.యానాం బీచ్‌లో జరుగుతున్న సంక్రాంతి సంబరాలకు నాల్గవరోజు గురువారం రాత్రి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీచ్ టూరిజంలో భాగంగా ఎస్.యానాం బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. నాలుగురోజులపాటు సంక్రాంతి సంబరాలను నిర్వహించడంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వ్యూహాత్మక ప్రణాళికను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ గతంలో ఎస్.యానాం టూరిజానికి తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గత వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. ఎస్.యానాం టూరిజం ప్రాజెక్టు అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు, కమిటీ సభ్యులు గ్రామస్తులు మంత్రిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు సంక్రాంతి సంబరాల్లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి తిలకించారు. ముగింపు సూచకంగా భారీఎత్తున కాల్చిన బాణసంచా అందరినీ ఆకట్టుకుంది.



తెగ తాగేశారు!

- సంక్రాంతిలో మద్యం కిక్కు
- పండుగలో రూ.7 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు
- 12 రోజుల్లో రూ.34.28 కోట్ల మద్యం విక్రయాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పర్వదినాల్లో మందుబాబులు మద్యాన్ని తెగ తాగేశారు. గతంలో ఉన్న రికార్డులను సైతం బద్దలు కొట్టేశారు. దాంతో జిల్లాలోని మద్యం షాపులన్నీ దాదాపు ఖాళీ అయ్యాయి. మూడు రోజుల సంక్రాంతి పర్వదినాల్లో మద్యం విక్రయాలు అనూహ్యంగా పెరగడంతో ఇప్పుడు షాపులు ఖాళీ అయి లిక్కరు డిపో వద్ద మద్యం సరుకు కోసం వాహనాలు క్యూ కట్టాయి. వివిధ బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉండడంతోపాటు గత ప్రభుత్వంకంటే భిన్నంగా నాణ్యమైన సరుకు వినియోగదారులకు అవసరమైన మద్యం బ్రాండ్లు, బీర్లను విక్రయించడంతో డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. దాంతో పండుగ మూడు రోజుల్లో రూ.7 కోట్ల విలువైన మద్యాన్ని తాగేశారు. ఈ కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి జనవరి 13వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 34.28 కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించారు. ఇక భోగి పండుగ రోజైన 13న 88 షాపులు, మూడు బార్‌లకు 9682 మద్యం కేసులు, 2215 బీరు కేసులకు సంబంధించి రూ.7.02 కోట్ల విలువైన మద్యం సరుకు సరఫరా అయింది. ఈ మొత్తం సరుకును పండుగ మూడు రోజులపాటు విక్రయించారు. జిల్లాలో 13 రోజులకుగాను ఒక ఆదివారం సెలవు దినం కావడంతో మిగిలిన 12 రోజులకు అమలాపురం ఐఎంఎల్ డిపో పరిధిలో ఉన్న 91 మద్యం షాపులకు, ఆరు బార్‌లకు 44,728 మద్యం కేస్‌లు, 22,071 బీరు కేస్‌లతో కలిపి రూ.34.28కోట్లు విలువైన మద్యాన్ని సరఫరా చేశారు. భోగి పండుగ తరువాత రెండు రోజులపాటు ఐఎంఎల్ డిపోకు సెలవు రావడంతో షాపుల్లో ఉన్న వివిధ బ్రాండ్ల మద్యాన్ని జోరుగా విక్రయాలు చేపట్టారు. దీనికితోడు అత్యధికంగా 13వ తేదీ ఒక్కరోజే 2215 కేస్‌ల బీర్ల విక్రయాలు జరగాయి. ప్రధానంగా పార్టీల పేరుతో విచ్చలవిడిగా మద్యం సేవించారని సమాచారం.

హత్య జరిగిందంటే.. ఆధారాలు లభించకపోయినా పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తారు.. కనిపెట్టేస్తారు.. హంతకుడిని కటకటాల్లోని నెట్టేస్తారు.. అయితే గంజాయి ఎలా వస్తుందో ఎక్కడి నుంచి వస్తుందో పోలీసులందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే.. అయినా అరికట్టలేకపోతున్నారు..

రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, కొవ్వూరు, నిడదవోలు వంటి ప్రధాన పట్టణాల్లోనూ గంజాయి ఎక్కడ లభిస్తుందనేది బహిరంగ రహస్యం.. అయినా దాడులు మాత్రం అంతంత మాత్రమే.. అవసరమైన సమయంలో మాత్రమే దాడులు చేస్తారు... కేసులు నమోదు చేస్తారు. ఎందుకంటే కేసులకూ ఒక లెక్క ఉంటుంది మరి..

ఈసారి సంక్రాంతి పండుగలో మందు.. సారాతోపాటు మరొకటి చేర్చారు.. అదే గంజాయి.. ఎప్పటి నుంచో గంజాయి వినియోగం ఉన్నా ఈ ఏడాది మాత్రం విచ్చలవిడిగా మారింది.. కోడి పందాల బరుల వద్ద గంజాయి విక్రయాలు సాగాయి. అయినా ఏ ఒక్కరూ అటు వైపు చూసిన దాఖలాలు లేవు. అసలు గంజాయి ఎలా రవాణా జరుగుతుందంటే పోలీసులు మాకేం తెలుసు అంటారు.. బయట జనాలకే తెలిసింది.. రక్షణాధికారులకు తెలియకపోవడం విడ్డూరమే కదా మరి.. ఇటీవల కూటమి ప్రభుత్వం ఈగల్ టీమ్‌లను నియమించింది.. ఆ టీమ్ ఎంతవరకూ అరికడుతుందో చూడాల్సిందే..





గంజా.. ఏదీ పంజా!

తూర్పును కమ్మేస్తున్న గంజాయి పొగ

- విచ్చలవిడిగా రవాణా
- రైలులో యువతతో తరలింపు
- బ్యాక్ బ్యాగ్‌లలో గంజాయి
- ఏజెన్సీ టూ హైదరాబాద్
- పండగలో భారీ వినియోగం
- బరుల వద్ద విక్రయాలు
- పల్లెలకూ పాకిన వైనం
- కన్నెత్తిచూడని నిఘా శాఖ
- అడపాదడపా మాత్రమే కేసులు
- రెచ్చిపోతున్న మాఫియా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రశాంతమైన 'తూర్పు'ను గంజాయి పొగ కమ్మేస్తోంది. యువత ఆ మత్తులో జోగుతూ రెచ్చిపోతోంది. రాత్రివేళ మరీ పేట్రేగిపోతోంది. రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలతో సహా నిడదవోలు, కొవ్వూరు, అమలాపురం వంటి పట్టణాల్లో గంజాయి వినియోగం విజృంభిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు గంజాయిని అరికట్టాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. గంజాయి నిర్మూలించండి మహాప్రభో అంటూ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఎస్పీకి విన్నవించారంటే పరిస్థితి ఎంత చేయిదాటిందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా రాజమహేంద్రవరం, రాజానగరం, నిడదవోలు తదితర ప్రాంతాల్లో గంజాయి పట్టుబడడమే దీనికో ఉదాహరణ. ఈ ఏడాది సంక్రాంతి పండుగలో కోడి పందాల బరుల వద్ద విచ్చలవిడిగా గంజాయి విక్రయాలూ సాగాయి. గతంలో ఎన్నడూ ఇలా సంక్రాంతి సమయంలో గంజాయి విక్రయాలు జరిగిన సందర్భాలు లేవు. ఇప్పటికే చాపకింద నీరులా ఆవహిస్తున్న గంజాయి మరింత బలంగా పాతుకుపోయే పరిస్థితి కానరావడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గంజాయి సరుకు గ్రామాల్లోనూ అందుబాటులో ఉండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

ఉమ్మడి తూర్పుగోదావరిలో గంజాయిపై ఉక్కుపాదం మాటలా ఉంచితే, కొంతకాలంగా సోదాలు కానరావడం లేదు. హైవే పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లు వాహన తనిఖీలు వదిలేశాయి. ఎక్కడో మారుమూల ఏజెన్సీలో సాగు చేస్తున్న గంజాయి నగరాలకు రావడం పరిపాటిగా మారింది. గ్రామాల్లోనూ గం'జాయ్' పొగ దట్టంగా మారింది. సుమారు గ్రాము గంజాయిని రూ.500కి విక్రయిస్తున్నారు. ప్రధానంగా నగరాల్లో పరిసర గ్రామాలకు చేరుకుంటున్న గంజాయి.. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతోంది. ఇంత జరుగుతున్నా పోలీస్ నిఘా (ఎస్‌బీ)కు ఎందుకు వాసన రావడం లేదనే ప్రశ్న చాలామందిలో ఉత్పన్నమవుతోంది.

గత ఐదేళ్లలో ఇదీ తీరు..

ఇక వైసీపీ ప్రభుత్వంలోనే గంజాయి విశృంఖలమైంది. ఉమ్మడి జిల్లాలో 2019లో 27 కేసులు నమోదుకాగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో 29, 2021లో 48, 2022లో ఏకంగా 84, 2023లో 69 కేసులు నమోదయ్యాయి. 2024లో 75 కేసులు పెట్టారు. ఐదేళ్లలో గంజాయి వినియోగించేవాళ్లు 209, విక్రయదారులు 483, సరఫరాదారులు 623 మంది కలిపి మొత్తం 1315పై కేసులు నమోదుచేయగా, 1116 మందిని ఆరెస్టు చేశారు. ఇంకా 199 మందిని అరెస్టు చేయాల్సి ఉంది. వీళ్లలో 2019లో కేసులు నమోదైనవాళ్లు 19 మంది ఉన్నారు. 2019 నుంచి 2024 నవంబరు వరకు 27,137 కిలోల గంజాయి, 212 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నేర నిరూపణ కాక ఇద్దరు విడుదలయ్యారు. ఒక్కరికీ శిక్ష పడలేదు. 133 మంది నిందితులను అసలు గుర్తించలేక పోయారు. జైలులో గంజాయి కేసుల్లో మగ్గుతున్న వారిలో అత్యధికం గిరిపుత్రులే. ఒక్క సెంట్రల్ జైలులోనే 600 మంది దాకా గంజాయి కేసులపై నిందితులే ఉంటారు.

గంజాయి వస్తుందిలా..

ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని మంచంగిపుట్ట, పాడేరు, అరకు, చింతపల్లి, పెదబ యలు, జి.మాడుగుల, హుకుంపేట, సీలేరు తది తర మండలాల్లోని దాదాపు 50 పంచాయతీల పరిధిలో 200 వరకూ గ్రామాల్లో సాగుచేస్తున్న గంజాయి 25 వేల ఎకరాల పైమాటే. మన్యంలో రూ.2 వేల కోట్ల వరకూ ఏడాదికి వ్యాపారం జరుగుతుందని అంచనా. గ్రామాల్లో కిలో రూ.2 వేల నుంచి ప్రారంభమవుతుంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది.



పాడేరు, చింతపల్లిలో రూ.5 వేలు, నర్సీపట్నంలో రూ.10 వేలు పలుతోంది. చింతపల్లి నర్సీపట్నం, తుని గుండా హైవేకు.. నర్సీపట్నం, కాకరపాడు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం, ఎర్రవరం దగ్గర హైవేకు అక్కడి నుంచి రాజానగరం మీదుగా రాజమండ్రికి.. ఇటు సీలేరు, డొంకరాయి, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం, రాజమండ్రికి ఏడాది పొడవునా సరఫరా జరుగుతుంది. చెన్నై, ఢిల్లీ, రాజస్థాన్, కర్నాటక, ఒడిశా వంటి ప్రాంతాలకు చేరిస్తే కిలోకి రూ.50 వేలు, హైదరాబాద్‌లో అప్పగిస్తే రూ.25 వేలుకిస్తారు.



స్టూడెంట్ల ముసుగులో..

హైవేల గుండా వాహనాల్లో దూర ప్రాంతాలకు చేరుతుంటే.. రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని, అన్నవరం రైల్వే స్టేషన్ల గుండా విజయవాడ, హైదరాబాద్‌లోని పబ్‌లకు వారానికి నాలుగైదుసార్లు గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం. దీనికి స్టూడెంట్ల మాదిరిగా కనిపించే కుర్రాళ్లను ఎంచుకుంటున్నారు. వాళ్ల వీపునకు తగిలించుకొనే బ్యాక్ ప్యాక్ బ్యాగులో కింద అర మాదిరిగా ఏర్పాటు చేస్తారు. సెల్‌ఫోన్ బాక్సుల్లో గంజాయి పెట్టి ఆ అరల్లో ఉంచుతున్నారు. ఈ వ్యక్తులు రైలు వచ్చే సమయానికంటే ముందే రైల్వే స్టేషనుకు చేరుకుంటారు. స్టూడెంట్ల మాదిరిగా తచ్చాడుతూ రైలు వచ్చే ప్లాట్‌ఫామ్‌కి అవతల వైపున.. అంటే ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌కి రైలు వస్తుందంటే రెండో నెంబరు ప్లాట్‌ఫాంపై తిరుగుతుంటారు. రైలు ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంకి చేరుకునే సమయంలో అటువైపు నుంచి బోగీలోకి ప్రవేశిస్తారు. కొందరికి రిజర్వేషన్లు ఉంటే.. మరికొందరు జనరల్ బోగీల్లో వెళుతున్నారు. బోగీలో కూడా వీళ్లు ఒకచోట కూర్చుని బ్యాగును మరో చోట పెడతారు. ఇలా చేరిస్తే రవాణా చార్జీలు కాకుండా రూ.3-5 వేలు గిట్టుబాటవుతుందని చెబుతున్నారు. రైళ్లలో తనిఖీలు నెమ్మదించడంతో గంజాయి రవాణా మరీ సులభంగా సాగిపోతోందని తెలుస్తోంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న పబ్‌కి రాజమండ్రి రైల్వే స్టేషను నుంచే గంజాయి సరఫరా అవుతుండడం ఒక ఉదాహరణ మాత్రమే. ట్రావెల్స్ బస్సుల్లోనూ గంజాయి తరలిస్తున్నారు.

'ఈగల్'తో సాధ్యమేనా!

గంజాయి తదితర నిషేధిత మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈఏజీఎల్ఈ-ఈగల్)ని ఏర్పాటుచేసింది. దీనికి సమర్థవంతమైన అధికారిగా పేరున్న ఆకే రవికృష్ణను ఐజీగా నియమించడంతోపాటు 1972 టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసింది. ఒకే ఈగల్ పోలీస్ స్టేషను ఉన్నప్పటికీ రాష్ట్రమంతా దీని పరిధిలోకి వస్తుంది. ప్రతి జిల్లాలోనూ ఈగల్ టీం ఉంటుంది. రాజమహేంద్రవరంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు. ఈగల్ విధివిధానాలపై ఇటీవలే హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ గంజాయి పొగ పోలీసులకు తెలియకుండా ఉంటుందా?... అయినా ఇప్పుడు ఈగల్ టీమ్‌కి స్థానిక పోలీసులు ఎంతవరకూ సహకరిస్తారనే అనుమానాలు ఉన్నాయి. ఒకవేళ ఆ టీమ్‌లో స్థానిక పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది ఉంటే ఉద్దేశం నీరుగారక తప్పదనే విమర్శలు వినవస్తున్నాయి.

పండుగ ఆనందం.. ఆవిరి

- ధారపల్లి జలపాతం సందర్శనకు వెళ్తుండగా ఘోర ప్రమాదం
- ఒమ్మంగి వద్ద పంటకాలువలోకి బోల్తా పడిన టెంపో వ్యాన్
- ఇద్దరు మహిళలు మృతి, 28 మందికి గాయాలు


మృతిచెందిన కోమాకుల చంద్రావతి, బత్తుల లక్ష్మీసురేఖ


ప్రమాదంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఆంధ్ర, తెలంగాణకు చెందిన వివిధ ప్రాంతాల బంధువులు కాకినాడలోని తూరంగిలో బంధువుల ఇంటికి సంక్రాంతి సంబరాలకు వచ్చారు. 3 రోజులు కాకినాడలో ఉండి సంతోషంగా గడిపారు. నాల్గో రోజు ముక్కనుమ నాడు ధారపల్లి జలపాతం చూసేందుకు బయల్దేరి ప్రమాదం బారినపడ్డారు. వారు ప్రయాణిస్తున్న టెంపో వ్యాన్ గురువారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి ఆర్అండ్బీ రహదారి వద్ద పంట కాలువలోకి బోల్తా పడడంతో ఇద్దరు మహిళలు మృతిచెందగా 28 మంది గాయాల పాలయ్యారు. దీంతో అప్పటివరకూ ఆనందంగా గడిపినవారిలో తీవ్ర విషాదం నెలకొంది.

ప్రత్తిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ తూరంగికి చెందిన కోమాకుల శ్రీనివాసరావు తోడల్లుళ్ల కుటుంబాలు విశాఖపట్నం, మిరియాలగూడ, హైదరాబాద్ నుంచి తూరంగికి వచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకుని భోగి, పెద్ద పండుగ, కనుమ మూడు రోజులు సందడిగా గడిపారు. నాల్గోరోజు ముక్కనుమ అయిన గురువారం ప్రత్తిపాడు మండలంలోని పర్యాటక ప్రదేశం అయిన ధారపల్లి జలపాతం చూడటానికి సన్నద్ధమయ్యారు. వారంతా కాకినాడలోని వినాయక ట్రావెల్స్‌కు చెందిన టెంపో వాహనాన్ని బుక్ చేసుకుని ఎంఎస్ఎన్ చార్టీస్ వద్ద నుంచి వ్యాన్ డ్రైవర్‌తో సహా 30 మంది బయల్దేరారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన వారి టెంపో వాహనం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి సమీపంలోని గోపాలుడు చెరువు దగ్గరలో చీకటి తోటకు వద్దకు చేరుకోగానే ఉత్తరకంచి ఆర్అండ్బీ రహదారిపై వాహనం రోడ్డు పక్కన ఉన్న చెట్టు దుంగను వేగంగా వచ్చి ఢీకొంది. పంట కాలువలో టెంపో వ్యాన్ బోల్తా పడింది. దీంతో తూరంగికి చెందిన కోమాకుల శ్రీనివాసరావు భార్య చంద్రావతి (45), తిమ్మాపురానికి చెందిన బత్తుల సత్యనారాయణ కుమార్తె బత్తుల లక్ష్మీసురేఖ (19) సంఘటనా స్థలం వద్ద తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే మరో 28 మంది గాయపడగా వారిలో 15మందికి తీవ్ర గాయాలు, 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

అతి వేగమే కారణమా..!

ఈ ప్రమాదానికి అతి వేగమే కారణంగా చెబుతున్నారు. వ్యాన్ డ్రైవర్ జి.రాంబాబు వేగంగా వాహనాన్ని నడపడాన్ని వారించినా వినలేదు. వేగం తగ్గించకుండా వెళ్లి ఒమ్మంగి గోపాలపురం చెరువు వద్ద వాహనాన్ని అదుపుచేయలేక రోడ్డు పక్కన ఉన్న చెట్టు దుంగను ఢీకొట్టాడు. దీంతో పంట పొలంలోకి వ్యాన్ బోల్తా పడిందని బస్సులో ప్రయాణించినవారు వాపోయారు.

కన్నీరు మున్నీరైన బంధువులు

టెంపో వ్యాన్ బోల్తా ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మహిళల బంధువుల రోదనతో ప్రత్తిపాడు ఆసుపత్రి నిండిపోయింది. ఈ సంఘటనలో మృతిచెందిన చంద్రావతికి భర్త కోమాకుల శ్రీనివాసరావు, ముగ్గురు సంతానం ఉన్నారు. మృతిచెందిన మరో యువతి బత్తుల లక్ష్మి సురేఖకు తండ్రి సత్యనారాయణ, తల్లి లక్ష్మి ఉండగా ఈ అమ్మాయి కాకినాడ పీఆర్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదుతుంది. బంధువులతో సరదాగా ధారపల్లి జలపాతం చూసేందుకు వెళ్లిన వారు టెంపో వ్యాన్ బోల్తా ఘటనలో ప్రాణాలు కోల్పోవడాన్ని వారి కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ కుటుంబీకులంతా ధారపల్లి జలపాతం వద్ద సేద తీరి సంతోషంగా గడపుదామనుకుంటే విధి వంచించి ఇలా ప్రమాద బారిన పడాల్సివచ్చిందని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థిని లక్ష్మీసురేఖ మృతితో తాపీ మేస్త్రీ పనులు చేసే ఆమె తండ్రి సత్యనారాయణ, తల్లి లక్ష్మీ తమ బిడ్డ ఉన్నత విద్యావంతురాలు అవుతుందని ఆశపడ్డామని అర్ధాంతరంగా మృత్యువు కబళించిందని కన్నీరుమున్నీరయ్యారు. తీవ్ర గాయాలకు గురైన వారిలో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తమ్మిశెట్టి సోమశేఖర్, ఆయన భార్య శివకుమారి, కుమార్తె హిమాంసీలు ఉన్నారు.


ప్రత్తిపాడు ప్రభుతాసుపత్రిలో చికిత్స పొంతున్న క్షతగాత్రులు

ప్రాణాలు కాపాడిన యువకులు

పంట కాలువలో టెంపో వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో టెంపో వెనుక బైక్‌పై వస్తున్న పెద్దిపాలెం యువకులు పండు, రాజు, గోవిందు చూసి క్షణాల్లో వ్యాన్ బోల్తాపడిన వారిని బయటకు తీసి అంబులెన్స్‌కు, పోలీసులకు వెనువెంటనే సమాచారం అందించారు. దీంతో సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.


పలువురి ప్రాణాలు కాపాడిన పెద్దిపాలెం యవకులు

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే సత్యప్రభ

టెంపో వ్యాన్ బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించి మృతుల బంధువులు, క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అండగా ఉండాలని కూటమి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్యను ఆదేశించారు. జరిగిన రోడ్డుప్రమాదంపై సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతంతో చర్చించారు. ఒమ్మంగి చీకటి తోట మలుపు వద్ద ప్రమాదాలు నివారణకు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులకు తెలియజేయాలని సీఐ, ఎస్‌లను ఆదేశించారు. ప్రత్తిపాడు తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఆర్ఐ గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యు డు వెలుగుల కొండలరావు, టీడీపీ నాయకులు అంబటి రాంబాబు, శెట్టి బత్తులవీరబాబు బాధితులను పరామర్శించారు.

తూరంగిలో విషాదఛాయలు

కాకినాడ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టెంపో వ్యాన్ బోల్తా ప్రమాదంలో కాకినాడ రూరల్ మండలం తూరంగికి చెందిన కోమాకుల చంద్రావతి(45) మృతిచెందింది. ఆమె భర్త శ్రీనివాస్‌కు, ముగ్గురు కూతుర్లు వరలక్ష్మి, అంజలి, శిరీషలకు తీవ్రమైన గాయాలు కావడంతో ప్రత్తిపాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనతో తూరంగిలో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వారంతా సంక్రాంతి పండుగను ఎంతో ఆనందంగా చేసుకుని విహార యాత్రకు బయలుదేరితే ప్రమాదం జరగడంతో తూరంగివాసులు ఆవేదన చెందుతున్నారు. చంద్రావతి మృతదేహాన్ని శుక్రవారం తూరంగిలోని వారి నివాసానికి తీసుకువస్తారని సమాచారం.

రోడ్డు ప్రమాదాల నివారణపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి

డ్రైవర్లకు పీరియాడికల్ మెడికల్ టెస్టులు : ఆర్టీసీ ఈడీ విజయరత్నం



అమలాపురం ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటిన ఆర్టీసీ ఈడీ విజయరత్నం

అమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై ఆర్టీసీ సంస్థ ప్రధానంగా దృష్టి సారించినట్టు జోన్-2 విజయవాడ నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి జయరత్నం తెలిపారు. జీరో యాక్సిడెంట్ రేట్ సాధించే దిశగా పలుచర్యలు ఇప్పటికే చేపట్టామన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని కోనసీమ జిల్లా అమలాపురం ఆర్టీసీ డిపోలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా డ్రైవర్లకు పీరియాడికల్ మెడికల్ టెస్టులు, నూతన బస్సుల టెక్నాలజీపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీనెల డ్రైవర్లకు విజయవాడ జోనల్ కార్యాలయంలో అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆయన మొక్కలు నాటారు. రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. డిపోలో మెరుగైన మెయింటినెన్స్ నిర్వహిస్తూ బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుంటున్నందుకు డిపో సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు, ఉత్తమ కండక్టర్లకు, గ్యారేజీ సిబ్బందికి ఈడీ విజయరత్నం ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా ప్రజా రవాణాధికారి మాట్లాడుతూ అమలాపురం డిపోకు 25 కొత్త బీఎస్-6 వాహనాలు వచ్చాయని, వాటి వల్ల ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి, సిబ్బంది, సూపర్‌వైజర్లు, వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి చెస్ పోటీలు

- ఐదు రోజులపాటు పెద్దాపురం శ్రీప్రకాష్ పాఠశాలలో నిర్వహణ
- 28 రాష్ట్రాల నుంచి 1239 మంది క్రీడాకారులు హాజరు
- ఏర్పాట్లు పరిశీలించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పెద్దాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఈనెల 17వ తేదీ నుంచి 21 వరకూ ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ నేషనల్ స్కూల్స్ జాతీయ స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. దీనిలో భాగంగా ఆయన చెస్ పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జేసీ రాహుల్ మీనాతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 5 రోజుల పాటు జరగనున్న పోటీల్లో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలకు చెందిన సుమారు 1239 మంది క్రీడాకారులు పాల్గొంటారని, అలాగే 560 మంది రేటెడ్ క్రీడాకారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 12 విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నా యని తెలిపారు. క్రీడాకారులకు కల్పించనున్న భోజన వసతి, సౌకర్యాలు తదితర విషయాలపై స్థానిక అధికారులతో చర్చించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి, జిల్లా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్, శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్ ప్రకాష్, చీఫ్ ఆర్బిటర్ పాల్ ఆరోఖ్యరాజ్, చెస్ అసోసియేషన్ ఛైర్మన్, కార్యదర్శి కేవీవీ శర్మ, సురేష్, కార్య నిర్వాహణాధికారి ఫణి, రాజాసూరిబాబురాజు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు


పరుగు పందాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ

కాకినాడ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు గురువారం 11వ రోజుకు చేరాయి. మొత్తం 657మంది హాజరుకాగా తదుపరి పరీక్షకు 377 మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తం గాప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కర్‌రావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి ఏడాది జైలు

కడియం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న కేసులో అరెస్టయిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి బాషా తీర్పునిచ్చారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. వీరవరంలో 2022లో దుర్గాదేవీ తీర్థం జరిగింది. ఆ సమయంలో రాజమహేంద్రవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్(లా అండ్ ఆర్డర్) హెడ్ కానిస్టేబుల్ పి.బుజ్జిబాబు బందోబస్తు డ్యూటీలో ఉన్నారు. పొట్టిలంక గ్రామానికి చెందిన డేగల వరప్రసాద్ బుజ్జిబాబు విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తీవ్రంగా గాయపరిచాడు. దీంతో టూటౌన్ హెచ్‌సీ పీఏ ప్రసాద్ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ పీవీజీ తిలక్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో ప్రసాద్‌కు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ కేసులో ఏపీపీ పీవీవీఎస్‌బీ రాజు వాదనలు వినిపించగా అప్పటి కోర్టు హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, కానిస్టేబుల్ కె.శ్రీనివాస్ సహకరించారు.

టాలెంట్ టెస్ట్‌లో 'షిర్డిసాయి'కి ర్యాంకులు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఏఎస్ రావు సైన్సు టాలెంట్ టెస్ట్‌లో రాజమహేంద్రవరంలోని తమ విద్యార్థులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్యా ప్రోగ్రాంలో పదో తరగతి చదువుతున్న ఐ.కశ్యప్ వంశీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, వి.పూజేంద్ర ద్వితీయస్థానాన్ని సాధించారన్నారు. మొత్తం 8 మంది విద్యార్థులు 20లోపు ర్యాంకులు సాధించారని, ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. విద్యార్థులను శ్రీవిద్యతో పాటు విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, లక్ష్యా డీన్ కె.శ్రీనివాస్ అభినందించారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

రూ.20 లక్షలతో ముసలమ్మ తల్లికి టేకు రథం


కాశీ, అమ్మిరాజు సోదరులను సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్


అమ్మవారికి బహూకరించిన టేకురథం

కడియం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక గ్రామదేవత పుంతలో ముసలమ్మ అమ్మవారికి విశ్వేశ్వర హైటెక్ నర్సరీ వ్యవస్థాపకుడు నక్కా రామ్మూర్తి-నాగత్రివేణి దంపతుల కుమారులు నక్కా కాశీవిశ్వేశ్వరరావు-రామలక్ష్మి, నక్కా అమ్మిరాజు-రత్నకుమారి దంపతులు సుమారు రూ.20 లక్షల విలువైన 13 అడుగుల టేకు రథాన్ని బహూకరించారు. ఈ రథాన్ని తమ నర్సరీ వద్ద 5 నెలల పాటు అనుభవజ్ఞులైన శిల్పులతో తయారు చేయించినట్టు కాశీవిశ్వేశ్వరరావు సోదరులు తెలిపారు. గురువారం ముసలమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధుల సమక్షంలో రథాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. గ్రామ దేవతకు విలువైన రథాన్ని ఇవ్వడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా కాశీ, అమ్మిరాజు సోదరులను భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గట్టి నర్సయ్య, వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, పంతం గణపతి, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, బొరుసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టులకు విరివిగా విరాళాలు

దాత రామకృష్ణకు ఘన సత్కారం


గుత్తిన దీవిలో దాత రామకృష్ణను సత్కరిస్తున్న గ్రామస్థులు

ఐ.పోలవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో నిర్వహించే అన్నదాన ట్రస్టులకు విరివిగా విరాళాలు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గుత్తినదీవి గ్రామానికి చెందిన కంతేటి రామకృష్ణ. ఆయన అన్నవరం దేవస్థానం అన్నదాన ట్రస్టుకు, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి అన్నదాన ట్రస్టుకు, అప్పనపల్లి వేంకటేశ్వర స్వామివారి అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష వంతున అందించారు. అమలాపురం రూరల్ మండలం వేమవరంలో శ్రీవల్లిదేవసేనసమేత సుబ్రహ్మణ్య స్వామివారికి రూ.లక్ష, గుత్తినదివిలో ఉన్న ఆర్యవైశ్య సంఘానికి రూ.3లక్షలు విరాళం అందించి ఉదారతను చాటుకున్నారు. ఈ మేరకు స్థానికులు దాత రామకృష్ణను గురువారం గ్రామంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెల్లు గంగాధరం, ఆకుల సత్తిబాబు, సలాది శ్రీనివాసరావు, కంతేటి కుమార్ పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఎంపికైనవారికి నెలకు రూ.5వేలు వంతున అందజేత

పిఠాపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకుగానూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను, 12నెలల పారిశ్రామిక అనుభవాన్ని అందిస్తారని, 20కంటే ఎక్కువ రంగాల్లో శిక్షణకు అవకాశంఉందని తెలిపారు. శిక్షణ పొందే విద్యార్థులు ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీఏ, బీకామ్, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఫార్మ్ వంటి డిగ్రీలు ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్, దూర విద్య ప్రోగ్రామ్‌ల్లో నమోదు చేసుకున్నవారు అర్హులని, 21-24 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణ పొందేవారికి ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనా పథకాల ద్వారా బీమా కవరేజీ ఉంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.5వేలు వంతున 12 నెలలు పాటు అందిస్తారని, అదే సమయంలో ఏకకాల గ్రాంటుగా రూ.6వేలు అందిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 21 ఆఖరి తేది అని చెప్పారు. ఈ ఇంటర్న్‌షిప్ కోసం **https://pminternship.mca.gov.in/** వెబ్‌సైట్ ద్వారా ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9966291339లో సంప్రదించాలన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు


పోటీలో తలపడుతున్న పురుష జట్లు

రామచంద్రపురం (ద్రాక్షారామ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడా ప్రాంగణంలో 14వ ఆలిండియా, 20వ ఆంధ్ర ప్రదేశ్ బాస్కెట్‌బాల్ టోర్నమెంటులో భాగంగా గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ పోటీల్లో మెన్స్ అండ్ ఉమెన్స్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రీక్వార్టర్స్ నుంచి క్వార్టర్స్ ఫైనల్స్‌వరకు జట్ల మధ్య పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. పురుషులు, మహిళ జట్ల మధ్య పోటీలను జరిగాయి.

సెమీస్‌కు చేరిన జట్లు

మహిళల విభాగంలో ఎస్ఆర్ఎం చెన్నై, పటేల్ అకాడమీ చత్తీస్‌ఘడ్, రామచంద్రపురం, సెంట్రల్ హైదరాబాద్ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో క్వార్టర్స్ ఫైనల్ మ్యాచ్‌లో సీఆర్‌పీఎస్ చండీఘర్, బిలాస్‌స్టీల్ చత్తీస్‌ఘడ్ జట్ల మధ్య జరిగిన పోరులో సీఆర్‌పీఎఫ్ చండీఘర్ గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. అదే విధంగా సెంట్రల్ టాక్స్ హైదరాబాద్, వైఎంజీ హైదరాబాద్ జట్ల మధ్య పోరులో సెంట్రల్ టాక్స్ గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. మరో క్వార్టర్స్‌లో రామచంద్రపురం, చిత్తూరు జట్లు, జి.మామిడాడ, డబ్ల్యుఈ హైదరాబాద్ జట్లు తలపడ్డాయి.


ఆడుతున్న మహిళల జట్లు

జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం


భోగాపురంలో పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కౌడా ఛైర్మన్ తుమ్మల బాబు

పిఠాపురం రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం కళాపరిషత్ తృతీయవార్షిక నాటక మహోత్సవంలో భాగంగా 4 రోజులు పాటు నిర్వహించే కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయ స్థాయి నాటిక పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీలను కౌడా ఛైర్మన్ తుమ్మల బాబు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటకరంగాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటికి పలు కళా పరిషత్‌లు నాటికలు, నాటకాల పోటీలు నిర్వహిస్తున్నాయని, వారికి ప్రభుత్వపరంగా తగిన సహకారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. నాటక కళాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కార్యక్రమంలో భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొంగలు.. కనువిందు


కోనసీమ జిల్లా అల్లవరం-రెల్లుగడ్డ రోడ్డులో దాళ్వా చేలల్లో కొంగలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

21 నుంచి జిల్లాస్థాయి కోనసీమ క్రీడోత్సవాలు

● కలెక్టర్ మహేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆటలతో ఆరోగ్యం పేరిట కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహించే కోనసీమ క్రీడోత్సవాలను విజయవంతం చేసేలా పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టరేట్ అధికారులతో కోనసీమ క్రీడోత్సవాల సన్నద్ధతపై సమీక్షించారు. మండలస్థాయిలో గెలుపొందిన 7, 8, 9 తరగతుల క్రీడాకారులకు ఈనెల 21 నుంచి అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. మండలస్థాయి నుంచి సుమారు 2,700మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వారికి అవసరమైన తాగునీరు, అల్పాహారం, భోజన, మౌళిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూడు డివిజన్ల వారీగా క్రీడాపోటీలు నిర్వహించి ఫైనల్స్‌కు చేరిన మూడు డివిజన్ల బృందాలు జిల్లాస్థాయిలో పాల్గొంటాయని స్పష్టం చేశారు. అథ్లెటిక్స్ గేమ్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ పోటీలను జిల్లాస్థాయిలో నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య ఏర్పాట్లు, ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ సరఫరా, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగం, తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టామన్నారు. క్రీడల నిర్వహణకు అయ్యే అంచనా, వ్యయాల నివేదికను రూపొందించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, జిల్లా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ పి.రామకృష్ణారెడ్డి, స్కూలు గేమ్స్ కార్యదర్శి శ్రీనివాస్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి బీవీఎస్ఎన్ మూర్తి, స్టేడియం కోచ్ భీమేష్, పీఈటీలు గణేష్, పి.రవి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలకు సిద్ధమైన జిల్లాజట్టు క్రీడాకారులతో డీఎస్పీ ప్రసాద్

సపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్టు పయనం

అమలాపురంటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి రెండు రోజులపాటు ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగే 28వ జూనియర్ సపక్‌తక్రా రాష్ట్రస్థాయి బాలబాలికల పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు, కార్యదర్శి కేతా సాయిదుర్గాప్రసాద్‌లు తెలిపారు. ఈ పోటీలకు జిల్లా జట్టును ఎంపికచేసి గత వారంరోజులుగా అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో కోచ్ యాండ్ర గౌతమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపులో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమానికి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శుక్రవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కోచ్‌గా బూల చిరంజీవి, టీమ్ మేనేజర్ జీవీ బాబు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరి శ్రీధర్‌వర్మ, డాక్టర్ వై.నరసింహారావు, కె.కృష్ణ, తోట రాము, కేవీవీ సత్యనారాయణ, చొల్లంగి అప్పాజీ పాల్గొన్నారు.

పరిశోధనాది కవి త్రిపురనేని



యలమంచిలి బాలరాజును సత్కరిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పరిశోధనా సాహితీ వేత్తలకు ఆదికవి త్రిపురనేని రామస్వామి అని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. గురువారం ముమ్మిడివరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో త్రిపురనేని 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజ్ఞాసాహితీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. దక్షిణాది ఆత్మగౌరవ భావజాల కవిగాను, అచ్చ తెలుగునుడి, కౌరసాహితీ వేత్తగాను, సంపూర్ణ జాతీయవాదిగాను, కవిరాజు త్రిపురనేని సుప్రసిద్ధుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సభలో త్రిపురనేని సాహిత్యానికి అందించిన సేవలను కొనియాడారు. ఇటీవల కోఆపరేటీవ్ సొసైటీ డైరెక్టర్‌గా ఎంపికైన బాలరాజును పలువురు సత్కరించారు. వేదికపై కవులు, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో రేవు అప్పలస్వామి, ఎస్ఎన్ మునేశ్వరరావు, వి.చిరంజీవి, కడలి సత్యనారాయణ, ఎం.ఆశీర్వాదం, జనిపెల్ల సత్యనారాయణ, ఎన్ అబ్బులు, ఉంగరాల వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాదరావు, వడ్డి నాగేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ, కన్నీడి సత్యనారాయణ, రాజశేఖర్, జి.పుండరీష్‌లతో పలువురు పాల్గొన్నారు.

'రోడ్డు సౌకర్యం కల్పించండి'

మలికిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి అంబోతు గుడి వద్ద మెయిన్ రోడ్డు నుంచి పూర్ణపేట మీదుగా జయపేట వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు సఖినేటిపల్లికి చెందిన పలువురు మహిళలు గురువారం వినతిపత్రం సమర్పించారు. విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంవద్ద మహిళలు మాట్లాడుతూ రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని, సువర్ణపేటలోని కమ్యూనిటీ హాలులో టాయిలెట్ల సౌకర్యంలేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం వెంటనే చేపడతామని, కమ్యూనిటీ హాలులో టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ నాయకులు బందెల శరత్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

సాగరతీరంలో సందర్శకుల సందడి

అల్లవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు సాగరతీరం సందర్శకులతో జనసంద్రమైంది. హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రముఖ నగరాల్లో ఉద్యోగాలు చేస్తూ సంక్రాంతి పండుగకు కోనసీమలోని సొంతూళ్లకు వచ్చినవారు తీరంలో సందడి చేశారు. కుటుంబ సమేతంగా ఓడలరేవు తీరంలో గంటల తరబడి గడిపారు. ఓడలరేవు బీచ్ రోడ్డు వందలాదిగా కార్లతోను, సందర్శకులతోను నిండిపోయింది.

మొల్లా ముస్తఫా అభివృద్ధికి రూ.8.64లక్షలు

● చెక్కు అందజేసిన ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే ఆనందరావు



మసీదు అభివృద్ధికి చెక్కును అందజేస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురంటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా హాజీ ముఖ్రం హుస్సేన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా అమలాపురం మొల్లా ముస్తఫా మసీదు అభివృద్ధికి రూ.8.64లక్షలు నిధులు మంజూరు చేశారు. గురువారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతులమీదుగా ఆ చెక్కును మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. నిధులు మంజూరు చేసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, సభ్యుడు ముఖ్రం హుస్సేన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ సోంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, అబేద్‌అలీ, టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ బషీర్, రాజా, ఎంకే అబ్బాస్, రజాఅబ్బాస్, ఆగాహుస్సేన్, మసీదుకమిటీ అధ్యక్షుడు ఎంఎంకేజీ మొయినుద్దీన్, కోశాధికారి వలీ, తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదికి పోటెత్తిన భక్తులు



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

అంతర్వేది, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. తొలుత క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని అనంతరం పుణ్యక్షేత్ర ఆలయాలను సందర్శించారు. స్వామివారి నాలుగు గోపురాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆలయ అధికారులు, సిబ్బంది స్వామి దర్శనాలకు ఎక్కువ సమయం తీసుకోకుండా భక్తులను త్వరితగతిన దర్శనం చేయించి ముందుకు పంపించారు. అనంతరం అన్నదానంలో భక్తుల రద్దీ మేరకు బఫే సిస్టమ్ ద్వారా అన్నప్రసాదం అందించారు. సాయంత్రం అంతర్వేది బీచ్, సాగరసంగమ ప్రదేశాల్లో భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో సందడి చేశారు.

భద్రతా నియమాలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ

● కలెక్టర్ మహేష్‌కుమార్



జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కోనసీమ జిల్లాలో ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లోజరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్‌ను వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండిషన్‌లో ఉండకపోవడం, అతివేగం, నిర్లక్ష్యం, అవగాహన లోపంతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రతీఏటా నమోదయ్యే మరణాల్లో 40 శాతం రోడ్డు ప్రమాదాలేనన్నారు. రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారుడితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి సైతం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. సంపాదనాపరుడు రహదారి ప్రమాదంలో మృతిచెందితే ఆ కుటుంబం చిన్నాభిన్నమై నానా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, అధికారులు రవికుమార్, జ్యోతి సురేష్, కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రభల తీర్థం



ప్రభలకు పూజలు చేస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అంబాజీపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా అంబాజీపేట సెంటర్‌లో నిర్వహించిన ప్రభలతీర్థం గురువారం కన్నుల పండువగా జరిగింది. మాచవరం కందుల మల్లేశ్వరస్వామి, యువ గణపతి స్వామి, పార్వతీ రాజేశ్వరస్వామివార్ల ప్రభలను అంబాజీపేట సెంటర్‌కు తీసుకువచ్చారు. అనంతరం ప్రభలను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సినీ ఆర్కెస్ట్రా, చిన్నారుల నృత్యాలు, డూప్ డ్యాన్సులు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రభలను ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రభలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గౌడయువసేన సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విదేశాల్లో వీరేశ్వరస్వామి సేవలు నమోదు

ఐ.పోలవరం, జనవరి16 (ఆంధ్రజ్యోతి) ఐ.పోలవరం మండలం మురమళ్లలో నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామివారి సేవలను దేశవిదేశాల్లో కూడా పొందేలా ఆలయ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశామని ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఇప్పటివరకు దేశంలో వున్న వారికి మాత్రమే వెబ్‌సేవలు అందుబాటులో ఉండగా ఇక నుంచి దేశవిదేశాలకు చెందిన భక్తులు స్వామివారి సేవలు పొందే అవకాశంను వెబ్‌సైట్ ద్వారా దేశం ఏదైనా మురమళ్ల వీరేశ్వరస్వామివారి సేవలు నమోదు చేసుకోవచ్చున్నారు. దేశం కోడ్ ద్వారా నమోదు చేసుకున్నసేవలకు సంబంధించిన వాట్సాప్ ద్వారా మెస్సేజ్ వెళుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్వామివారి భక్తులు వున్న నేపథ్యంలో ఈ సౌకర్యం కల్పించామన్నారు. https://www.sriveereswaraswamytemple.com.. .వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

కనకముత్యాలమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా సఖినేటిపల్లి మండలం అంతర్వేది కొత్తముత్యాలమ్మ ఆలయంవద్ద జాతర మహోత్సవాలు అంత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి అనంతరం అమ్మవారికి నైవేధ్యాలు సమర్పించారు. గురువారం ఉదయం అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో గరగలు సమర్పించారు. అలాగే గ్రామ ఆడపడుచులు అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించి కనకముత్యాలమ్మ, కనకదుర్గమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆలయంవద్ద తీర్థ మహోత్సవాల్లో పాటు విద్యుత్ అలంకరణ, కోలాటం భజనలు, ప్రేమ్‌కుమార్ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే అమ్మవార్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. మండలంలో పలుచోట్ల సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి.

ఘనంగా వనువులమ్మతల్లి తీర్థం



వనువులమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

అమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తాండవపల్లి గ్రామ పరిధిలోని శెట్టిపల్లిలో ఉన్న గ్రామదేవత వనువులమ్మతల్లి తీర్థ మహోత్సవం గురువారం జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆడపడుచులు మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

మలికిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కడలి సుబ్రద్రనరసింహమూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గుడిమెళ్లంకలో అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు గురువారం రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సేవా దృక్పథంతో ట్రస్టును ఏర్పాటు చేసినట్టు ట్రస్టు నిర్వాహకుడు కడలి బాబూరావు తెలిపారు.

మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉపాధి అవకాశాలు

అమలాపురంటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్‌ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు మండల స్థాయిలో రీసోర్స్ పర్సన్ల ఎంపిక చేపట్టినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా రిసోర్స్ పర్సన్ల ఎంపిక జరుగుతుంది. కంప్యూటర్, ఇంటర్నెట్‌లో ప్రావీణ్యం కలిగి ఉండాలని, సొంత స్మార్ట్‌ఫోన్ ఉండాలని, ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి కలిగి ఉండాలన్నారు. 2024 నవంబరు 1 నాటికి 30 ఏళ్లలోపు వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులతోపాటు ట్రాన్స్ జెండర్లు సైతం అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, ఈనెల 24న ముమ్మిడివరంలోని ఎయిమ్స్ కళాశాలలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్ 8919868419ను సంప్రదించాలన్నారు.

బలుసుతిప్ప మాజీ సర్పంచ్ మృతి



కాట్రేనికోన, జనవరి 16(ఆంధ్రజ్యోతి):కాట్రేనికోన మండలం బలుసుతిప్ప మాజీ సర్పంచ్ ఇసుకపట్ల శ్రీనుబాబు (48) గురువారంరాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈనెల 14న ఆయనకు గుండెపోటు రావడంతో కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందారు. ఆయన మృతిపట్ల మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, జెడ్పీటీసీ నేలకిషోర్, ఎంపీపీలు పాలెపు లక్ష్మీదర్మారావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకటసుధాకర్, సర్పంచ్ ఏడుకొండలు సంతాపం వ్యక్తం చేశారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

అమలాపురంరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బండారులంక బిళ్లవారి వీధిలో సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. శ్రీశ్రీనివాసా బాలమిత్రసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జి.విజయ ప్రథమ, ఊటుకూరి వెంకటేశ్వరి ద్వితీయ, వి.కౌశల్య తృతీయ బహుమతులు సాధించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, భారతీకిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రతినిధి ఉప్పుగంటి బాస్కరరావు, పచ్చిగోళ్ల సుధ, మాడా రాము చేతులమీదుగా బహుమతులు అందజేశారు. బాలమిత్ర సంఘం ప్రతినిధులు బాబు, సత్తిరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

● నెమరు వేసుకున్న పాత జ్ఞాపకాలు



వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

అమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1994-99 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక గురువారం జరిగింది. చదువులమ్మ చెట్టు నీడలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. తొలుత అలనాడు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులు జి.గోపాలకృష్ణ, జి.అయ్యప్ప నాయుడు, విజయలక్ష్మి, ఎన్.సుబ్రహ్మణ్యం, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.పట్టాభిరామయ్య, ఎ.రామలింగేశ్వరరావు, ఏవీవీ సత్యనారాయణమూర్తి, డి.ప్రసాదరావు, వి.లోకనాథరావులకు పూర్వ విద్యార్థులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గురువులను సత్కరించి పాదపూజలు చేశారు. ఉత్సాహంగా సాగిన కార్యక్రమాన్ని కరెళ్ల చాముండేశ్వరరావు (బాబ్జి), కరెళ్ల రవికుమార్, తోట ఈశ్వరరావు, ఉడుము గంగబాబు, మామిళ్లపల్లి రవిమోహన్, వస్కా సత్తిబాబు, గుంటూరి దుర్గాదేవి, కోడూరి సురేష్, నాగా సీత, మెండా ఫాతిమాలక్ష్మి, దేవాని లీలాశివసుబ్రహ్మణ్యం తదితరులు పర్యవేక్షించారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులంతా చదువులమ్మ చెట్టునీడన సేద దీరారు.

అంబాజీపేట, పుల్లేటికుర్రులో...

అంబాజీపేట: అంబాజీపేట, పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. పుల్లేటికుర్రులో 1999-2000 బ్యాచ్, అంబాజీపేటలో 2001-02 పదో తరగతి బ్యాచ్‌లు కలుసుకున్నారు. అలనాటి విశేషాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో ఒకేచోట కలుసుకుని ఫోటోలు దిగారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

27 సంవత్సరాల తరువాత...

మామిడికుదురు: వారంతా 27 సంవత్సరాల క్రితం ఈదరాడ హైస్కూలులో పదో తరగతి చదివి సంక్రాంతి సందర్భంగా కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. స్కూలులో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు స్కూలు ఆవరణలో కలుసుకుని ఆనాడు తాము చేసిన చిలిపి పనులు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.



అంబాజీపేట: పుల్లేటికుర్రులో ఒకేచోట కలిసిన పూర్వపు విద్యార్థులు

ఆత్మీయ కలయిక

అంతర్వేది : సఖినేటిపల్లి లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను నిర్వహించారు. సఖినేటిపల్లి స్థానిక సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, పులగం రమేష్ తమ అభిరుచులను తోటి పూర్వ విద్యార్థులతో పంచుకున్నారు.

క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం

సఖినేటిపల్లి క్షత్రియ ఆత్మీయ సమ్మేళాన్ని అల్లూరి సీతారామరాజు క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపించిన రుద్రరాజు చినవెంకటరాజు, ఉయ్యూరి వెంకటసుబ్బరాజు, బుద్ధరాజు సుబ్బరాజు, రుద్రరాజు రామరాజు, రుద్రరాజు పద్మరాజు, పెన్మెత్స సుబ్బరాజు, గాదిరాజు కృష్ణమరాజు, అల్లూరి శ్రీనివాసరాజు, క్షత్రియ సేవాసమితి సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో రుద్రరాజు సుబ్బరాజు, వెంకటపతిరాజు, ఆర్వీవీ రాజు, ఆర్ఎస్ రాజు, జంపన బుజ్జిరాజు పాల్గొన్నారు.

45 ఏళ్ల తర్వాత...

యానాం: యానాంలోని మహాత్మాగాంధీ బాలుర ఉన్న త పాఠశాలలో 1980-81లో పదో తరగతి చదువుకున్న ఆనాటి విద్యార్థులు 45ఏళ్ల తరువాత కలుసుకున్నారు. జవహర్ బాలభవన్ సూపర్‌వైజర్ చింతా కొండలరావు సారథ్యంలో గురువారం సాయంత్రం పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సమావేశమై తాము చదువుకున్న సమయంలో జరిగిన అనేక మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. సమావేశంలో మాజేటి నటరాజన్, సలాది దుర్గా శ్రీనివాస్, సుదర్శనం సత్యశ్రీనివాస్, గీదా సత్యనారాయణ, ముత్యాల బ్రహ్మానందరావు, నల్లా వెంకన్న, కట్టా సుబ్బారావు, కొప్పిశెట్టి వెంకన్నబాబు, తటవర్తి మార్కండేయులు, వర్ధినీడి సత్యనారాయణ, ఓలేటి పేర్రాజు, కామిశెట్టి భుజంగ సాయి, కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.







మామిడికుదురు: ఈదరాడ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు, అంతర్వేది: లూథరన్ పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, యానాం : యానాంలో కలుసుకున్న 1981-82 బ్యాచ్ విద్యార్థులు

వాడపల్లి ఆలయంలో భక్తుల రద్దీ


విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నేము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. అన్నదాన భవన నిర్మాణానికి పెనుమంట్ర మండలం ఆలమూరుకు చెందిన పడాల సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు రూ.1.16 లక్షల విరాళం ఇవ్వగా, దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ. 6,17,372 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మారెమ్మ జాతర


ఉచ్చిలిలో అమ్మవారి జాతర నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామదేవత మారెమ్మ జాతరను గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. వివిధ కళాకారుల ప్రదర్శనలు, గరగనృత్యాలు, డప్పు వాయిద్యాలు, బుట్టబొమ్మలు ఆకట్టుకున్నాయి. గ్రామ ఆడపడుచులు సారె, చీరలతో అమ్మవారిని అత్తవారింటికి సాగనంపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆత్రేయపురం కనక మహాలక్ష్మి అమ్మవారి జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు.

వెదురుపాకలో వైభవంగా గౌరీదేవి సంబరం

రాయవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామంలో గౌరిదేవి సంబరాన్ని గురువారం వైభవంగా జరిపారు. తూర్పుకాపుల విద్య, విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్య ంలో జరిగిన కార్యక్రమంలో నంది వాహనంపై గౌరిదేవి, పరమేశ్వరుడిని ఉంచి గ్రామోత్సవం జరిపారు. జాతర సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ జరిపి పూజలు, హారతులు నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యాండ్ మేళాలు, త్రీన్‌మార్‌లు, శక్తివేషాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని గురువారం రాత్రితో పాటు, శుక్రవారం ఉదయం గ్రామంలో ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు.


వెదురుపాకలో గౌరీదేవిని దర్శించుకున్న భక్తులు

వైభవంగా చిన్న తలుపులమ్మ జాతర


పసలపూడి ఉత్సవంలో సందడి చేసిన భక్తులు

రాయవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పసలపూడి శివారు ప్రాంతంలోనున్న చిన్న తలుపులమ్మ జాతరను గురువారం వైభవంగా జరిపారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పసలపూడి, సోమేశ్వరం, చెల్లూరు, మాచవరం, రామచంద్రపురం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరలు, పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి మొక్కుబడి చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, నిర్వాహక కమిటీ సభ్యులు నల్లమిల్లి ముకుందరెడ్డి, ఎన్.బుల్లి వీర్రెడ్డి, కట్టా వెంకటరమణ, కె.గణేష్, సత్తి వాకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెదపళ్లలో ప్రభను ఊరేగిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మ తీర్థం

ఆలమూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామదేవత పోలేరమ్మ ఉత్సవాన్ని గురువారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారి ప్రభను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రభను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ప్రభను గ్రామంలో వివిధ రకాల డప్పుల వాయిద్యాలతోపాటు కేరళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభ ఊరేగింపు సందర్భంగా భక్తజనం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నామాల వెంకటేష్ అధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


ఆత్మీయ కలయికలో పాల్గొన్న 2003 -04 పామర్రు హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కె.గంగవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-04 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. చిన్నప్పటి స్నేహితులంతా ఒకచోటకు చేరి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహితులకు కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం చదువు చెప్పిన గురువులు అవసరాల రామకృష్ణ, సీవీవీ సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, వెంకట్రావు, వాకలపూడి శ్రీనివాసు, నున్న నరసింహమూర్తి, గుణ్ణం సత్తిబాబు, చామకూర గోపాలరావు, నండూరి భీమరాజులను వారు సత్కరించారు. చిన్నప్పటి స్నేహితుల కలయికకు కారణమైన పూర్వ విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సందడి

ఆత్రేయపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మాగాంధీ హైస్కూల్‌లో 2002-03లో పదవ తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఒకచోట చేరి సందడి చేశారు. గురువారం హైస్కూల్‌లో వారంతా కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. అప్పటి గుర్తులను ఒకరినొకరు గుర్తు చేసుకుని పులకించారు. పాఠశాల అభివృద్ధికి చేయాల్సిన అంశాలపై వారు చర్చించుకున్నారు. అప్పటి గురువులను వారు సత్కరించి ఆశీస్సులు పొందారు.


ఆత్రేయపురంలో మహాత్మాగాంధీ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

కోతుల బెడద తప్పించరూ..

• వానరాల స్వైరవిహారంతో ప్రజల బెంబేలు • సమస్య పరిష్కరించాలని అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి

ఆత్రేయపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బర్లంక బ్యారేజీపై కోతుల స్వైర విహారంతో ప్రజలు భయాందోళలు చెందుతున్నారు. ఆహ్లాద వాతావరణం, గోదావరి జిల్లాలకు సాగునీరు పంపించే బ్యారేజీ అందాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. మరోవైపు బ్యారేజీపై కోతులు గుంపులుగా చేరి పర్యాటకులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆనందంగా గడిపేందుకు వచ్చే పర్యాటకులు తినే తినుబండరాలు సైతం అవి లాక్కునిపోతున్నాయి. వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న కోతులను పట్టుకుని బ్యారేజీ వద్ద వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వందల సంఖ్యలో కోతులు బొబ్బర్లంక, పేరవరం, వెలిచేరు, పేరవరం గ్రామాల్లో సంచరిస్తూ పంటలు, కిరాణా షాపులు, హోటల్‌పై చొరబడి తినుబండారాలు, వస్తువులు ఎత్తుకుపోతున్నాయని పలువురు వాపోతున్నారు. దీనిపై సంబంధిత బాధితులు ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని ఆరోపిస్తున్నారు. ఇటీవల ఈ ప్రాం తంలో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి పలువురు స్థానికులు కోతుల బెడదను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులతో మాట్లాడినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


బొబ్బర్లంక కాటన్ బ్యారేజీపై స్వైరవిహారం చేస్తున్న కోతులు

రేపు మెగా రక్తదాన శిబిరం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని 18న వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. రేపు ఉదయం లయన్స్ కల్యాణ మండపంలో జరిగే మెగా వైద్య శిబిరంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు.



అమలాపురంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్. పక్క చిత్రంలో రావులపాలెం ఆర్టీసీ డిపో సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్

భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కోనసీమ జిల్లాలో ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 వాల్ పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్‌ను వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండిషన్‌లో ఉండకపోవడం, అతివేగం, నిర్లక్ష్యం, అవగాహన లోపంతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ప్రతీ ఏటా నమోదయ్యే మరణాల్లో 40 శాతం రోడ్డు ప్రమాదాలేనన్నారు. జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. సంపాదనా పరుడు రహదారి ప్రమాదంలో మృతి చెందితే వారి కుటుంబం చిన్నాభిన్నమై పోతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు, మోటారు వాహనాల తనిఖీ అధికారులు రవికుమార్, జ్యోతి సురేష్, కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

రావులపాలెం: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని రావులపాలెం మోటార్ సైకిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ రమణ ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. మనిషి తప్పిదాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, గ్యారేజ్ ఇన్‌చార్జ్ రాజు, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రయాణికుల రద్దీ

రావులపాలెం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులు ముగిసిన నేపథ్యంలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. కోనసీమలో జరిగిన సంక్రాంతి సంబరాలు, ప్రభల ఉత్సవాల్లో పాల్గొని తిరుగు ప్రయాణాల్లో వారంతా నిమగ్నమయ్యారు. దీంతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, జాతీయ రహదారి సమీపంలో ప్రయాణికులతో రద్దీ నెలకొంది.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

21 నుంచి జిల్లాస్థాయి కోనసీమ క్రీడోత్సవాలు

అమలాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆటలతో ఆరోగ్యం పేరిట కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహించే కోనసీమ క్రీడోత్సవాలను విజయవంతం చేసేలా పటిష్ఠమైన ఏర్పాట్లను చేపట్టాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టరేట్ అధికారులతో కోనసీమ క్రీడోత్సవాల సన్నద్ధతపై సమీక్షించారు. మండలస్థాయిలో గెలుపొందిన 7, 8, 9 తరగతుల క్రీడాకారులకు ఈ నెల 21 నుంచి అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలస్థాయి నుంచి సుమారు 2,700 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వారికి అవసరమైన తాగునీరు, అల్పాహారం, భోజన, మౌలిక వసతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూడు డివిజన్ల వారీగా క్రీడా పోటీలు నిర్వహించి ఫైనల్స్‌కు చేరిన మూడు డివిజన్ల బృందాలు జిల్లాస్థాయిలో పాల్గొంటాయని స్పష్టం చేశారు. అథ్లెటిక్స్ గేమ్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ పోటీలను జిల్లాస్థాయిలో నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందిస్తామన్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య ఏర్పాట్లు, ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ సరఫరా, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగం, తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టాన్నారు. క్రీడల నిర్వహణకు అయ్యే అంచనా, వ్యయాల నివేదికను రూపొందించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, జిల్లా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, స్కూలు గేమ్స్ కార్యదర్శి శ్రీనివాస్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి బీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

ఆత్రేయపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి బాలవికాస్ కేంద్రంలో సంక్రాంతి సందర్భంగా జరిపిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. నిర్వాహకుడు సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ముక్కనుమ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. లొల్ల-వాడపల్లి బాలవికాస్ చిన్నారులు దేవతా స్వరూపాలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


వాడపల్లిలో అందంగా తీర్చిదిద్దిన బొమ్మలకొలువు

భీమేశ్వరస్వామి నిత్యాన్నదానానికి లక్ష విరాళం

ద్రాక్షారామ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన పుప్పాల అజయ్‌కుమార్ ఒక లక్షా 116 విరాళం అందించారు. గురువారం స్వామి వారి ఆలయంలో సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావుకు చెక్కును అందించారు. కార్యక్రమంలో సినీనటులు రాంజీజగన్, మురళీకృష్ణంరాజు, లయన్స్ క్లబ్ బంజారా సభ్యులు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


అన్నదానానికి విరాళం ఇస్తున్న కుమార్


అంగర ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు

జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సందడి

కపిలేశ్వరపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. 2007-08లో 10వ తరగతి చదివిన విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ సమాజంలో గౌరవంతో మెలుగుతూ ముందుకు వెళ్లాలని తమకు, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు హితవు పలికారు. పదహారు ఏళ్లకు ఆత్మీయ సమ్మేళనం జరగడం ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

సహపంక్తి భోజనాలతో సందడి

కపిలేశ్వరపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం గ్రామంలో గురువారం మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్ కుటుంబ సభ్యులు, బంధువులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో సందడి చేస్తూ సహపంక్తి భోజనాలు చేశారు. అంగరలో పద్మాలయ స్టూడియోకు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు ఒకే అరిటాకుపై భోజనాలు చేస్తూ సందడి చేశారు. ఇది మరుపు రాని రోజని వారు పేర్కొన్నారు.

పీవీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల అపూర్వ కలయిక

ద్రాక్షారామ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పీవీఆర్ ఉన్నత పాఠశాల 2001-2006 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను వారు సత్కరించారు. చింతా సురేష్‌కుమార్, కఠారి మురళీ, వంగారాజా తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.


పాఠశాల ఆవరణలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

నేటి నుంచి గాడ్ జన్మదిన వేడుకలు

రాయవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ 89వ జన్మదిన వేడుకలు ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తొలిరోజు తమిళనాడు రాష్ట్రం అరుణాచలం వేద పండితులతో అరుణాచలేశ్వరస్వామికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు అరుణాచలేశ్వరస్వామికి అపీత కుచాంబదేవి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామన్నారు. జన్మదిన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం ముచ్చుమిల్లి మధ్య కొంపలు మధ్యకాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడి వయస్సు 35 దాటి ఉండవచ్చని నలుపురంగు ప్యాంటు, నీలం రంగు షర్టు ధరించాడని, ఎత్తు అయిదున్నర అడుగులు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. వీఆర్‌వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉపాధి అవకాశాలు

అమలాపురం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్‌ను జిల్లాలో అమలు చేసేందుకు రీసోర్స్ పర్సన్ల ఎంపిక చేపట్టినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా రిసోర్స్ పర్సన్ల ఎంపిక జరుగుతుంది. కంప్యూటర్, ఇంటర్నెట్‌లో ప్రావీణ్యం కలిగి ఉండాలని, స్మార్ట్‌ఫోన్ ఉండాలని, ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి కలిగి ఉండాలన్నారు. 2024 నవంబరు 1 నాటికి 30 ఏళ్లలోపు వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులతో పాటు ట్రాన్స్‌జెండర్లు సైతం అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, ఈ నెల 24న ముమ్మిడివరంలోని ఎయిమ్స్ కళాశాలలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8919868419లో సంప్రదించాలన్నారు.


శ్రీరామపురం ప్రభల తీర్థం వద్ద సందడి చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో ప్రభల తీర్థం

కపిలేశ్వరపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మాచర పంచాయతీ శివారు శ్రీరామపురం చెరువు గట్టు, పడమర ఖండ్రికలోని పోసమ్మ ఆలయం, కోరుమిల్లిలో ఏటిగట్టు వద్ద గురువారం ప్రభల తీర్థాలు ఘనంగా జరిగాయి. ముక్కనుమను పురస్కరించుకుని కపిలేశ్వరపురం, మాచర, టేకి, శ్రీరామపురం, అంగర తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలను ఒకచోట చేర్చి తీర్థం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో ప్రభలను ఊరేగిస్తూ భక్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో పలు గ్రామాల భక్తులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


పోటీలకు సిద్ధమైన జిల్లా జట్టు క్రీడాకారులతో డీఎస్పీ ప్రసాద్

రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్టు పయనం

అమలాపురంటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి రెండు రోజులపాటు ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగే 28వ జూనియర్ సపక్‌తక్రా రాష్ట్రస్థాయి బాలబాలికల పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు, కార్యదర్శి కేతా సాయిదుర్గాప్రసాద్‌లు తెలిపారు. ఈ పోటీలకు జిల్లా జట్టును ఎంపికచేసి గత వారంరోజులుగా అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో కోచ్ యాండ్ర గౌతమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపులో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమానికి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శుక్రవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కోచ్‌గా బూల చిరంజీవి, టీమ్ మేనేజర్ జీవీ బాబు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరి శ్రీధర్‌వర్మ, డాక్టర్ వైనరసింహారావు, కె.కృష్ణ, తోట రాము, కేవీవీ సత్యనారాయణ, చొల్లంగి అప్పాజీ పాల్గొన్నారు.